# రాష్ట్ర ప్రభుత్వం తరపున 25 కోట్ల రూపాయల చెక్కును

# కేరళ సి.ఎం.కు అందజేసిన హోంమంత్రి నాయిని

అధిక వర్షాలు పడి వరదల కారణంగా ప్రాణ, ఆస్థి నష్టంతో అతలాకుతలమైన కేరళ రాష్ట్రాన్ని ఆదుకునేందుకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖరరావు ప్రకటించిన 25 కోట్ల రూపాయల చెక్కును తెలంగాణ రాష్ట్ర హోం మరియు కార్మిక శాఖామంత్రి శ్రీ నాయిని నర్సింహ్మారెడ్డి కేరళ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్‌కు ఆదివారం నాడు త్రివేంద్రంలో అందజేసారు. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని స్వయంగా అందజేసేందుకు హోంమంత్రి ఆదివారం ఉదయం హైదరాబాద్ నుండి త్రివేంద్రంకు బయలుదేరి వెళ్ళారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్ ప్రిన్సిపల్ రెసిడెంట్ కమీషనర్ జి. అశోక్‌కుమార్‌తో కలిసి ఆదివారం మధ్యాహ్నం కేరళ ముఖ్యమంత్రిని కలుసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించిన ఆర్థిక సహాయాన్ని అందజేస్తూ మంత్రి మాట్లాడారు. మానవతా ధృక్పథంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేయవలసిన సహాయాన్ని చేస్తుందన్నారు. ఎంత సహాయం చేసినప్పటికి కేరళ రాష్ట్ర ప్రజల ఇబ్బందులు తీర్చలేనివని విచారం వ్యక్తం చేసారు. పొరుగు రాష్ట్రం పట్ల సానుభూతితో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ముందుకు వచ్చి సహాయం చేయాలని నిర్ణయించారన్నారు. ఆర్థిక సహాయాన్ని అందించేందుకు తనను స్వయంగా వెళ్ళమని ఆదేశించడంతో తాను వచ్చానని తెలియజేశారు. వరదల వలన కేరళ రాష్ట్రంలో జబ్బులు అధికం అవుతాయని, పలు ప్రాంతాలు నీట మునగటంతో కోలుకోవడానికి సమయం పడుతుందన్నారు. గత నూరు సంవత్సరాలలో రాని ప్రకృతి వైపరీత్యం కేరళలో రావడంతో రాష్ట్ర ప్రజలు గుండె ధైర్యంతో ఈ పరిస్థితులను ఎదుర్కోవాలని అభిప్రాయపడ్డారు. ఈ పరిస్థితుల పట్ల చలించిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి పొరుగు రాష్ట్రమైన కేరళకు అండగా ఉంటామనే సందేశాన్ని పంపేందుకు నన్ను పంపారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని వర్గాలను కూడా తమ వంతు సహాయం చేయాలని ముఖ్యమంత్రి పిలుపు నిచ్చారని తెలియజేసారు. దీనికి స్పందిస్తూ సినీ వర్గాల వారు, పార్లమెంట్ సభ్యులు, ఇతర అధికార, అనధికార వర్గాల వారు ముందుకొచ్చిన విషయాన్ని హోంమంత్రి గుర్తు చేసారు.

తన నెలసరి వేతనం కేరళ సి.ఎ.ం. సహాయనిధికి :

తమవంతు సహాయంగా తెలంగాణ రాష్ట్ర మంత్రులు ఇప్పటికే నెల వేతనాన్ని కేరళ సి.ఎ.ం సహాయనిధికి పంపారని, అదేవిధంగా తన నెలరోజుల వేతనాన్ని కూడా సి.ఎం. సహాయనిధికి అందజేస్తానన్నారు.

పునరావాస కేంద్రాల పరిశీలన :

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖరరావు ఆదేశాల మేరకు త్రివేంద్రమ్ చేరుకున్న హోంమంత్రి ఆదివారం సాయంత్రం స్థానికంగా ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను సందర్శించారు. వరదలమూలంగా ప్రాణ, ఆస్థి నష్టాలను చవిచూసిన రాష్ట్ర ప్రజలు పునరావాసం పొందుతున్న వైనాన్ని స్వయంగా పరిశీలించారు. ఆప్తులను కోల్పోయి, ఇళ్ళు కూలిపోయి, పంటలు వరదల పాలైన వారికోసం ఏర్పాటు చేసిన కేంద్రాలలో తాత్కాలికంగా ఆహార, వసతి సదుపాయాలను కల్పిస్తున్న తీరు పరిశీలించిన హోంమంత్రి వారితో మాట్లాడారు. పరిస్థితులు మెరుగుపడతాయని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంఅండగా ఉంటుందన్న భరోసాను ఇచ్చారు. అతలాకుతలమైన పరిస్థితుల నుంచి కేరళ రాష్ట్ర ప్రజలు బయటపడేందుకు గుండె నిబ్బరంతో ముందుకు సాగాలని హితవు చెప్పారు. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల ప్రభుత్వాలు, స్వచ్ఛంధ, సినీ, రాజకీయ ప్రముఖులు సహాయం చేస్తున్నారని కేరళ రాష్ట్ర ప్రజలకు ఈ విపత్కర పరిస్థితులలో కొండంత అండగా ఉంటామని అభయమిచ్చారు. నిరాశ్రయులైన ప్రజలకు హోంమంత్రి ధైర్యం చెప్పారు. ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్ళదీస్తున్న అభాగ్యులను ఆదుకునేందుకు భారతీయులంతా ముందుకు రావాలని, చుట్టూ నీటితో మునిగిపోయినప్పటికీ, తాగేందుకు గుక్కెడు “మంచి నీరు” దొరకక విలవిలలాడే వారిని చూసి హోంమంత్రి చలించిపోయారు.